ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 23.04.2026 సమయం :13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నగరంలోని అంగన్వాడి కేంద్రాలను ఈరోజు సందర్శించి, చిన్నారులకు అందుతున్న పోషకాహారం పై ఆరా తీశారు.

2. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన భేటీ కానున్న రాష్ట్ర మంత్రివర్గం పలు కీలకాంశాలు చర్చించే అవకాశం ఉంది.

3. ఆర్టీసీ కార్మికుల సమ్మె నేడు రెండవ రోజు కొనసాగుతోంది. కార్మిక సంఘాలు డిపోల ఎదుట మహా ధర్నాలు నిర్వహిస్తున్నారు.

4. తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ సరఫరాలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తెలిపాయి.

-------------------------------

**కిషన్ రెడ్డి - అంగన్ వాడి కేంద్రాలు**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ రోజు ముషీరాబాద్ పరిధిలోని మెడిబావి అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ చిన్నారులకు అందుతున్న పోషకాహారం గురించి ఆరా తీశారు. మంత్రి పర్యటనలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ...అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతల పోషకాహార అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తోందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా మెరుగైన పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు.

**( డెస్క్)**

------------------------------

**రాష్ట్ర మంత్రి వర్గం భేటీ....**

రాష్ట్ర మంత్రివర్గం ఈ రోజు సచివాలయంలో సమావేశం కానుంది. ఈ భేటీలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజల కార్యాచరణపై సమీక్షించి, జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా చేపట్టాల్సిన అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలుపై నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పు, ఆర్టీసీ సమ్మె, ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, మెట్రో రైల్ స్వాధీనం, కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

( డెస్క్)

------------------------------

**రేషన్ బియ్యం పంపిణీ...**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 21వ తేదీ నాటికే రేషన్ షాపుల ద్వారా 86 శాతం బియ్యం పంపిణీ పూర్తయిందని పౌరసరఫరాల సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన రేషన్ పంపిణీ రాష్ట్రంలో సజావుగా సాగుతుందని పేర్కొంది. మూడు నెలలకు గాను 6.43 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటికే 5.48 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ పూర్తయిందని తెలియచేసింది. కొత్తగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో గోదాముల్లో స్థలం ఇబ్బందులు రాకుండా ఉండేందుకు గాను మూడు మాసాల రేషన్ బియ్యాన్ని ఏప్రిల్ మాసంలోనే లబ్దిదారులకు ఇవ్వడం జరుగుతుందని వెల్లడించింది.

( ప్రెస్ నోట్)

--------------------------------

**మేఘాలయ అంగన్వాడీలు...**

మేఘాలయలో అంగన్వాడిలు చిన్నారుల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా రూపుదిద్దుకున్నాయని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మేఘాలయ పర్యటన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆటల ద్వారా నేర్పే విధానం, సృజనాత్మక వాతావరణం పిల్లల్లో నేర్చుకునే ఆసక్తిని పెంచుతున్నాయని తెలిపారు. అంగన్వాడి టీచర్లతో పాటు అదనంగా వాలంటీర్లు వ్యవస్థీకృతంగా పనిచేయడం, సమాజం మొత్తాన్ని ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయడం మేఘాలయ మోడల్‌కు ప్రత్యేకతను తీసుకువచ్చిందని మంత్రి తెలిపారు.

**( ప్రెస్ నోట్ )**

------------------------------

**సంగారెడ్డి - ప్రభుత్వ ఆసుపత్రులు**

సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో సదుపాయాలపై వైద్యులతో సమీక్ష నిర్వహించారు. వివిధ విభాగాల పనితీరు, రోగులకు అందుతున్న సేవల నాణ్యత, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు, తదితర అంశాలపై చర్చించారు. సంగారెడ్డిలో చేపట్టిన డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

**( పిటీసీ - సంగారెడ్డి)**

--------------------------------

**మహబూబ్ నగర్ – వికలాంగులు**

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో అర్హులైన దివ్యాంగులకు స్కూటీలు, ట్రై సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లులు సహా పలు సహాయ ఉపకరణాలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత మూడు సంవత్సరాల్లో 150 కోట్లను దివ్యాంగుల సంక్షేమానికి కేటాయించినట్లు తెలిపారు.

**బైట్... ముత్తినేని వీరయ్య**

**( పిటీసీ - మహబూబ్ నగర్ )**

-------------------------------------

**చార్మినార్ ను సందర్శించిన ఆదివాసీలు....**

చారిత్రక చార్మినార్ ప్రాంగణం ఆదివాసీల రాకతో కోలాహలంగా మారింది. ఈ రోజు ఉదయం ఆదిలాబాద్ ఆదివాసీ బృందం భాగ్యనగరానికి చిహ్నామైన చార్మినార్ ను సందర్శించింది. మొదటిసారిగా చార్మినార్‌ను సందర్శించిన ఆదివాసీలు దాని నిర్మాణ శైలిని చూసి అబ్బురపడ్డారు. ప్రాచీన కాలం నాటి శిల్పకళా వైభవం తమను ఎంతగానో ఆకట్టుకుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. చార్మినార్ విశిష్టతను, దానికున్న చారిత్రక నేపథ్యాన్ని పర్యాటక శాఖ అధికారులు వారికి వివరించారు. నగర పర్యటనలో భాగంగా తమకు లభించిన ఈ గౌరవం, ఆత్మీయత మర్చిపోలేమని ఆదివాసీ బృందం సంబురపడింది.

**( ప్రెస్ నోట్)**

-------------------------------------

**ఆర్టీసీ సమ్మె....**

రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజు కొనసాగుతోంది. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న ప్రకటించారు. ఈ రోజు అన్ని డిపోల్లో మహా ధర్నాలు నిర్వహిస్తున్నామన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వంతో తిరిగి చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి తెలిపారు. కాగా ఈ రోజు ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, అదిలాబాద్, వరంగల్, మహబూబ్ నగర్, మెదక్, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహా ధర్నా నిర్వహిస్తున్నారు. కాగా, ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రాంతాల్లో అధికారులు అద్దె బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తున్నారు.

**( పిటీసీలు)**

----------------------------------

**వంట గ్యాస సరఫరా...**

తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ సరఫరాలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఒక ప్రకటనలో తెలిపాయి. సరఫరాను

మరింతగా మెరుగు పర్చడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించాయి. ఈ నెలలో నిన్నటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 37.77 లక్షల వంట గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశామని తెలిపాయి. వాణిజ్య ఎల్‌పీజీ సరఫరా కోసం ప్రత్యేక పోర్టల్ లో తమ అవసరాలను నమోదు చేసుకోవడానికి వాణిజ్య సంస్థలకు సూచించాయి.

**( పిఐబి)**

-------------------------------------

**సిరిసిల్ల - పోషన్ అభియాన్**

పోషణ్ అభియాన్ లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం , పోషణ్ పఖ్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం ఆకాశవాణి తో మాట్లాడుతూ........

**బైట్... లక్ష్మీ రాజం**

**( పిటీసీ - రాజన్న సిరిసిల్ల)**

----------------------------------

**బీజేపి – భగీరథ జయంతి వేడుకలు...**

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పాల్గొని భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భగీరథుడు రామాయణంలో ప్రస్తావించబడిన మహనీయుడు మాత్రమే కాకుండా, సగర సామాజిక వర్గం దైవంగా భావించే ఆధ్యాత్మిక ప్రతీకగా నిలిచాడని కొనియాడారు. సమాజంలో నీతి, కట్టడాలు, కృషి వంటి రంగాల్లో సగర వర్గం చేస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**( ప్రెస్ నోట్)**

---------------------------------

**వరంగల్ - ఎర్రబల్లి ...**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసమే అసత్య ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే ఇవ్వడం బీఆర్ఎస్ పార్టీ నిజాయితీకి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ, వ్యవస్థలను రాజకీయ కక్షసాధింపుకు వాడుకుంటుందని ఒక ప్రకటనలో విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో దెబ్బతిన్న పిల్లర్లను మరమ్మతు చేసి సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**( పిటీసీ - వరంగల్)**

-------------------------------------

**సిబీఎస్ ఈ షెడ్యూల్...**

సీబీఎస్ఈ పదో తరగతి రెండో విడత పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మే 15 నుంచి మే 21 వరకు  పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది నుంచి పదో తరగతి పరీక్షలు ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తామని సీబీఎస్ ఇప్పటికే ప్రకటించింది.

**( డెస్క్)**

----------------------------------

**జనగామ -  భగీరథ మహర్షి**

సగర వంశీయులైన భగీరథ మహర్షి గంగా నదిని స్వర్గం నుంచి భూమిపైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వి అని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. ఈరోజు కలెక్టరేట్ లో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ... నిరంతర కృషి,పట్టుదలకు భగీరథు మహర్షి ప్రతీక అన్నారు. ఏదైనా సాధించాలనే సంకల్పానికి, నిరంతర కృషికి "భగీరథ ప్రయత్నం" ఒక గొప్ప స్ఫూర్తి అని తెలిపారు.

**( పిటీసీ  - జనగామ)**

-----------------------------

**నాగర్ కర్నూల్..... ఆర్టీసీ ఆందోళన**

ఆర్టీసీ సమ్మె సందర్భంగా విధుల్లో చేరే డ్రైవర్లు, కండక్టర్ల విధులకు ఎవరైనా ఆటంకం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని నాగర్ కర్నూల్ ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించరాదని కార్మికులకు సూచించారు. సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఘటనకు సంబంధించి కల్వకుర్తి, కొల్లాపూర్ లో రెండు కేసులు నమోదు అయినట్లు ఎస్పీ తెలిపారు.

**( పిటీసీ - నాగర్ కర్నూల్)**

---------------------------------

**వాతావరణం...**

తెలంగాణలో రాబోవు మూడు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు ఒకటి నుండి 2 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 42 నుండి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయని పేర్కొంది. రాబోవు మూడు రోజుల్లో ములుగు, భద్రాద్రి కొత్త గూడెం, ఖమ్మం, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలియచేసింది.

**( డెస్క్)**

------------------------------------